చెట్లతోనే మానవాళి మనుగడ

- అడవులను రక్షిస్తూ పచ్చదనాన్ని కాపాడుకోవాలి
- ఎకో పార్కులో 25వేల మొక్కలు నాటడమే లక్ష్యం
- వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి సీతక్క



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : చెట్లతోనే మానవాళికి మనుగడ ఉంటుందని, వీచే గాలి స్వచ్ఛంగా ఉంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎకో పార్కులో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ములుగు జిల్లాను అడవుల జిల్లాగా మార్చాలని అన్నారు. ఎకో పార్కులో 25వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ములుగు జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, పర్యాటక ప్రాంతంతో పాటు దట్టమైన అడవులు ఉండటం వలన పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని తెలిపారు. ఎకో ప్రాంతంలో వాచ్ టవర్, వాక్ పాత్స్ ఏర్పాటు (మిగతా 8వ పేజీలో)

అభివృద్ధిలో దూసుకుపోతున్న జిల్లా

- సంపూర్ణ అభియాన్‌లో మెరుగైన ఫలితాలు
- జిల్లాకు మూడు 'నీతి అయోగ్' అవార్డులు
- రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంతో సిల్వర్ మెడల్ కైవసం
- నేడు గవర్నర్ చేతుల మీదుగా మెడల్ అందుకోనున్న కలెక్టర్



భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ అత్యంత వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా దూసుకుపోతుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి అయోగ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో జిల్లా మెరుగైన ఫలితాలు సాధిస్తుంది. సంపూర్ణ అభియాన్‌లో మెరుగైన ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిన జిల్లా మూడు సిల్వర్ మెడల్స్‌ను గెలుచుకుంది.

జిల్లాలోని మహాముత్తారం, పలిమెల బ్లాక్స్ పరిధిలో చేస్తున్న అభివృద్ధికి, జిల్లాకు మొత్తం మూడు సిల్వర్ మెడల్స్‌ను నీతి అయోగ్ ఎంపిక చేసింది. సంపూర్ణ అభియాన్‌లో భాగంగా గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, విద్యాసంస్థలకు విద్యుత్ సదుపాయం కల్పించడం, స్వయం సహాయక సంఘాలకు వృత్తి శిక్షణ అందించడం, భూసార పరీక్షలు చేయడం, గర్భిణులకు 100 శాతం ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్స్ చేయించడం వంటి విభాగాల్లో మెరుగైన ఫలితాలు సాధించడంతో జిల్లా సిల్వర్ మెడల్స్‌కు ఎంపికైంది. కాగా, శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ రాహుల్‌శర్మ మెడల్స్ తీసుకోనున్నారు.

స్వచ్ఛదనం..పచ్చదనం జాడేది...?

పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



పట్టణంలోని పైలెట్‌కాలనీకి సమీపంలో రోడ్డు పక్కన వేసిన చెత్తాచెదారం



- జిల్లాలో కానరాని పారిశుధ్య చర్యలు
- పేరుకుపోతున్న చెత్తతో దోమల విజృంభన
- ఫాగింగ్ లేదు.. బ్లీచింగ్ చల్లరు..
- పట్టించుకోని అధికారులు
- వంద రోజుల ప్రణాళికకు తూట్లు
- వర్షాలతో పెరుగుతున్న మలేరియా కేసులు
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో స్వచ్ఛదనంతో పాటు పచ్చదనం కానరావడం లేదు. పారిశుధ్య చర్యలు లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దాంతో పాటు విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. ప్రతీ ఏడాది సీజన్‌కు ముందు స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న అధికార యంత్రాంగం ఆచరణలో మాత్రం ఎక్కడా అమలు చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా గ్రామాలు, ఇటు మునిసిపాలిటీల్లో పారిశుధ్యం పడకేసింది. ఫలితంగా ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే.. జిల్లాలో విషజ్వరాలు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. ముఖ్యంగా మారుమూల మండలాల్లో సరైన శానిటేషన్ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మలేరియా గణాంకాలను పరిశీలిస్తే భూపాలపల్లి జిల్లా అగ్రస్థానంలో ఉండడం ఇక్కడున్న దయనీయ పరిస్థితులకు అద్దం పడుతోంది. దేశ వ్యాప్తంగా మలేరియా కేసులు అదుపులోకి వచ్చాయని కేంద్ర ప్రభుత్వం ఓ వైపు డంకా బజాయించి ప్రచారం చేసుకుంటున్నా.. భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకుంటున్న మలేరియా కేసులు మాత్రం వాస్తవ పరిస్థితులకు దర్పణం పడుతున్నాయి. గ్రామాల్లో ఆవాసాల పరిసరాల్లో వరదనీరు చాలా రోజుల పాటు నిలువ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా ఇన్‌చార్జీల పాలనలో గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా డ్రైడే నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఆనవాళ్లు ఎక్కడా కనిపించడం లేదు.

అధికారులు అప్రమత్తం..

జిల్లాలో ఇటీవల వారం రోజుల పాటు వర్షాలు కురవడంతో నీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. దాంతో అంటువ్యాధులు క్రమంగా విస్తరిస్తుండడంతో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ప్రతి శుక్రవారం గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ జ్వరపీడితుల వివరాలను సేకరించాలని నిర్ణయించారు. జిల్లాలోని 13 ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలోని 30 ఉపకేంద్రాల్లో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఇదిలావుండగా గత ఏడాది ఇదే సీజన్‌లో 71కి పైగా డెంగీ, 6 మలేరియా, వెయ్యికి పైగా సాధారణ విషజ్వరాల కేసులు నమోదు కాగా, ఈసారి అంటువ్యాధుల తీవ్రత అధికంగా ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి ప్రాంతాల్లో మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నట్లు తెలుస్తోంది.

మునిసిపాలిటీలో కనిపించని స్వచ్ఛదనం

భూపాలపల్లి పట్టణంలో స్వచ్ఛదనం, పచ్చదనం ఊసే కనిపించడం లేదు. జూన్ నుంచే ప్రారంభం కావాల్సిన కార్యక్రమాలు రెండు నెలలు కావస్తున్నా.. ఇంత వరకు అతీగతీ లేదు.

వంద రోజుల ప్రణాళిక ప్రకారం రోజువారీగా పనులు చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు ఆ జాడే లేదు. కాలువల్లో చెత్త పేరుకుపోతుంది. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. రోడ్లపైనే చెత్తాచెదారం పడేస్తున్నా.. తొలగించడం లేదు. పైగా దోమలు, ఈగలు రాకుండా ఉండేలా ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ కానీ చల్లడం లేదు. దీంతో దోమల స్వైర విహారంతో రోగాల బారిన పడతున్నామని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణంలో మొక్కలు నాటాల్సి ఉంది. కానీ, ఎక్కడా కార్యక్రమాన్ని చేపట్టలేదు. పైగా (మిగతా 8వ పేజీలో)



శాంతినగర్ సమీపంలో రోడ్డు పక్కనే ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

భూపాలపల్లి బైపాస్‌కు పచ్చ జెండా

- నిధుల మంజూరుకు కేంద్రం సానుకూలత
- త్వరలోనే డీపీఆర్ తయారు చేసి టెండర్లు పిలుస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి హామీ
- 2025-26 వార్షిక ప్రణాళికలో నిధుల మంజూరు
- ఫలించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య కృషి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో వరంగల్ ఎంపీ కడియం కావ్య

భూపాలపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ బైపాస్ నిర్మాణానికి సంబంధించి త్వరలోనే డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్)ను తయారు చేసి టెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుడతామని కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి సమాచారమిచ్చారు. ఇదిలా ఉండగా, కేంద్రం మంజూరు చేయనున్న రూ.250 కోట్ల నిధుల్లో రూ.175 కోట్లు రోడ్డు నిర్మాణం, మరో రూ.75 కోట్లు భూసేకరణ కోసం వినియోగించనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన నిధులను 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చి మంజూరు చేస్తామని మంత్రి నితిన్ గడ్కరి హామీ ఇచ్చారు. భూపాలపల్లి పట్టణంలో అత్యంత ప్రమాదకరంగా మారిన 353సి జాతీయ రహదారికి బైపాస్ లేకపోవడం వల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి వందలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసి ఒత్తిడి తెచ్చారు. దీంతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి శుక్రవారం ఎంపీ కావ్యకు లేఖ రాశారు. త్వరలోనే ప్రాజెక్టు డీపీఆర్‌ను తయారుచేసి టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. భూపాలపల్లి ప్రజల సమస్య త్వరలోనే తీరనుందని ఎంపీ కావ్య మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదాలతో నెత్తురోడుతున్న రహదారి..

భూపాలపల్లి ప్రాంతంలో బొగ్గు గనులతో పాటు, గోదావరి పరిసరాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి నిత్యం వేలాది వాహనాల రాకపోకలు, జెన్‌కో పవర్ ప్రాజెక్టుకు రవాణా వంటి కార్యకలాపాలతో 353సి జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. దీంతో చెల్పూర్ నుంచి కాటారం మధ్య రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. కేవలం మూడేళ్లలోనే 578 రోడ్డు ప్రమాదాలు జరిగితే ఇందులో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు శాశ్వత దివ్యాంగులుగా మారారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి
- ఆస్పత్రులతో పాటు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ములుగు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ చేసి దోమల నియంత్రణ చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను, ఉప కేంద్రాలలో మానిటరింగ్ సూపర్ వైజర్‌లను నియమించి ఈ వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ వ్యాధులను నియంత్రించడానికి పటిష్టమైన ప్రణాళికలు తయారు చేశామని తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడానికి వైద్యాధికారులతోపాటు ఆర్‌బీఎస్‌కే ఎంసీహెచ్ ఎపడమిక్ టీంలతో పాటు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేసే పల్లె దవాఖాన వైద్యాధికారులను నియమించామని చెప్పారు. గొత్తికోయ, ఇతర హైరిస్క్ గ్రామాల్లో ఇప్పటికే యాంటీ లార్వా స్ప్రేలు నిర్వహించామని కలెక్టర్ దివాకర తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గోపాల్‌రావు, డీపీవో దేవరాజ్, మునిసిపల్ కమిషనర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

- ఏటూరునాగారం: ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో వర్షాకాలంలో ప్రబలే మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. రాబోయే రెండు నెలల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రిలోని ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారి కేస్ షీట్‌లను పరిశీలించి ప్లేట్‌లెట్స్ సంఖ్య గురించి ఆరా (మిగతా 8వ పేజీలో)



కలెక్టరేట్‌లో సమీక్షలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం

- ఢిల్లీ వెళ్లుడు.. కాంగ్రెస్ పెద్దల కాళ్లు మొక్కుడే ఆయన పని
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు
- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి

హనుమకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక.. ప్రజలకు ముఖం చూపించలేక సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లుడు.. కాంగ్రెస్ పెద్దల కాళ్లు మొక్కుడు చేస్తున్నాడని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్సీ రవీందర్‌రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. 2023 నవంబరులో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చిందన్నారు. ఏళ్ల తరబడి ఫిరాయింపు పిటీషన్లు పెండింగ్‌లో ఉంచడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని అత్యున్నత ధర్మాసనం తెలిపిందని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను ప్రజలు ఛీకొడుతున్నారని తెలిపారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల సభ్యత్వం వెంటనే రద్దు అయ్యేలా చట్టాన్ని మార్చాలని కోరారు.

ప్రజలు నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రవీందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేతుల్లోనే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్‌గా మారిందని అన్నారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని, సెక్రటేరియేట్‌లో ప్రభుత్వ అధికార యంత్రాంగంతో సమీక్షలు జరపడానికి ఆమె ఎవరు అని ప్రశ్నించారు. సంగారెడ్డి ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం ఘటనలో మంత్రులతో సమీక్ష చేయడంపై మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం అని లీడర్‌కు, క్యాడర్‌కు ఎప్పుడో తెలిసిపోయిందని అన్నారు. రేవంత్‌ను పక్కకు బెట్టి మీనాక్షి నటరాజన్ తెలంగాణలో పాదయాత్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్‌పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్ధన్‌గౌడ్, పులి రజినీకాంత్, బుద్దె వెంకన్న, కోడెపాక దేవమ్మ, పోలెపల్లి రాంమూర్తి, వీరేందర్, నయీమొద్దీన్, మహేందర్, మూటిక రాజు, రమేష్, శ్రీకాంతాచారి, సతీష్, గౌస్‌ఖాన్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ పాటకు పట్టం



ఇటీవల వరంగల్‌లో కాసర్ల శ్యామ్‌ను సత్కరిస్తున్న మిత్రులు

- 'బలగం' సినిమాలోని 'ఊరూ.. పల్లెటూరు..' పాటకు పురస్కారం
- జాతీయ స్థాయి సినీ అవార్డుల్లో ఉత్తమ గేయంగా ఎంపిక
- 22 ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనదైన ముద్ర
- ఎన్నో హిట్‌పాటల రచయితగా గుర్తింపు



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 2023 సంవత్సరానికి గాను జాతీయస్థాయిలో ప్రకటించిన సినీ అవార్డుల జాబితాలో ఓరుగల్లు పాట పట్టం కట్టించుకుంది. హనుమకొండకు చెందిన సినీ గేయరచయిత కాసర్ల శ్యామ్ బలగం సినిమా కోసం రాసిన 'ఊరూ.. పల్లెటూరు' పాటకు జాతీయస్థాయిలో అవార్డును ప్రకటించడం విశేషం. వేణు దర్శకత్వంలో విడుదలైన బలగం సినిమాలో అన్ని పాటలు కాసర్ల శ్యామ్ రాయడం విశేషం. దాదాపు అన్ని పాటలు ప్రజాదరణ పొందాయి. భీమ్స్ సంగీతం వహించగా కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాట జాతీయస్థాయిలో తెలుగు విభాగంలో ఉత్తమ గేయంగా నిలిచింది.

శ్యామ్ ప్రస్థానం..

2003లో బి.జయ దర్శకత్వంలో రూపొందించిన చంటిగాడు సినిమాలో కొక్కొరకో పాటతో పరిశ్రమలో గేయ రచయితగా అడుగుపెట్టిన శ్యామ్.. రెండు దశాబ్దాల తరువాత జాతీయస్థాయిలో తన ప్రతిభను నిరూపించుకోవడం (మిగతా 8వ పేజీలో)



తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న మద్యం, వస్తువులను చూపుతున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

తొర్రూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు (కార్డన్ సెర్చ్) నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, అనుమతిలేని వాహనాలు, గుడుంబా, నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తొర్రూరు సీఐ గణేశ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సాయినగర్, రాజీవ్‌నగర్, అంబేద్కర్ నగర్ ఏరియాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించగా అనుమతిలేని, నంబర్ ప్లేట్‌లు లేని 20 ద్విచక్ర వాహనాలు, రూ.10వేల అక్రమ మద్యం, 10 లీటర్ల గుడుంబా, 40 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అక్రమంగా నిల్వ చేసినా, గుడుంబా విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, రమేశ్, క్రాంతి, శివ, అంజమ్మ, సిబ్బంది ఉన్నారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

ఇనుగుర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం చీన్యాతండా గ్రామ పంచాయతీ పరిధి ఐలయ్యబావితండాలో భూక్య హర్ల(55) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసముద్రం ట్రైనీ ఎస్ఐ నరేష్ శుక్రవారం తెలిపారు. హర్ల కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకుండా ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఆయన్ను 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ అర్ధరాత్రి ప్రాంతంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. మృతుని కుమారుడు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ నరేష్ తెలిపారు.

102 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు

కాటారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాటారం డివిజన్ పరిధిలోని కాటారం, మల్హర్‌రావు, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. అనారోగ్యం, ప్రమదాల బారిన పడిన పలువురు ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఆర్థిక సాయం కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సంప్రదించగా ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 102 మంది లబ్ధిదారులకు రూ.35.01లక్షల విలువైన చెక్కులు రాగా పంపిణీ చేయనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ అధికారులు వెల్లడించారు. కాటారం మండలంలో 27, మల్హర్‌రావు మండలం 35, మహాముత్తారం మండలం 20, మహదేవపూర్ మండలం 18, పలిమెల మండలంలో 2 చెక్కులు మంజూరు అయ్యాయి.

ఒక మార్పు అభివృద్ధికి మలుపు

ఫోటోలకు ఫోజులతో పనులు కావు
సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు

తొర్రూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అన్ని మునిసిపాలిటీల్లో విజయవంతంగా కొనసాగుతోందని, తొర్రూరులో క్లీన్ అండ్ గ్రీన్ పబ్లిసిటీ, పార్కు ల డెవలప్‌మెంట్, సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఫోటోలకు ఫోజులతో పనులు కావని, పనులు చేస్తుంటే అభివృద్ధి జరుగుతుందని, ప్రతీ రోజు ఒక కార్యక్రమాన్ని చేపడితే ప్రజల నుంచి మద్దతు లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మేనేజర్ కట్టస్వామి, ఏఈ రంజిత్, వార్డు సిబ్బంది తదితరులు ఉన్నారు.

మూడు నెలలలోపే పనుల పూర్తి కావాలి

మరిపెడ: మరిపెడ మునిసిపాలిటీలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అమృత్ వర్క్స్‌ను గుత్తేదారులు మూడు నెలలలోపే పూర్తి చేయాలని రాష్ట్ర కమిషనర్ ఆఫ్ డెవలప్‌మెంట్ మునిసిపల్ అడ్మిన్‌స్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు మునిసిపల్ ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సివిల్ సప్లయి గోదాం దగ్గర నిర్మితమవుతున్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. మునిసిపల్ ఆఫీస్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. మునిసిపల్, సిబ్బంది, మెప్మా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అక్కడి వెళ్లి ఆయన వారితో మాట్లాడారు. డంపింగ్ యార్డు, నిలిచి పోయిన మోడల్ మార్కెట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఇంజినీర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. మునిసిపల్ కమిషనర్ విజయానంద్, డీఈఈ నవీన్, ఏఈ శృతి, మేనేజర్ శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తొర్రూరులో సిబ్బందికి సూచనలు చేస్తున్న నారాయణరావు

అవాకులు.. చెవాకులు మానుకో..

● రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

డోర్నకల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అవాకులు.. చెవాకులు మానుకోవాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మన్నెగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్‌లో తన ప్రాధాన్యత గురించి రాంచందర్‌నాయక్ అవాకులు పెల్చుతున్నాడని అన్నారు. తన స్థాయి ఏమిటో రాష్ట్ర, జిల్లా ప్రజలకు తెలుసనని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో లంబాడ సామాజికవర్గానికి రాష్ట్ర మంత్రి మండలిలో కాంగ్రెస్ చోటు కల్పించలేదన్నారు. లంబాడలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్ పదే.. పదే ప్రకటిస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నుంచి కనీసం ఖండన ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో సమస్యలన్నీ ఎక్కడివి.. అక్కడే ఉన్నాయని, వారి పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు కనీసం చొరవ కూడా చూపడం లేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో సైతం విఫలం చెందారని చెప్పారు.



మన్నెగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

ఈ సమావేశంలో కొండపల్లి సీతారాం రెడ్డి, విజయపాల్‌రెడ్డి, సురేష్‌పాట్నీ, ముత్తయ్య, వెంకన్న, రాంబాబు, ఉపేందర్‌లు పాల్గొన్నారు.

పారా ఒలంపిక్స్‌లో తెలంగాణకు పతకాల పంట

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన 10వ పారా ఒలంపిక్స్‌లో తెలంగాణ రాష్ట్రానికి పతకాల పంట పండింది. జూలై 25 నుంచి ఆగస్టు 1వరకు మలేషియా దేశంలోని కూచింగ్‌లో జరిగిన 10వ ఆసియా తైక్వాండో పూమ్సే, క్యూరోగి పారా ఒలంపిక్స్‌లో భారత్ నుంచి ముగ్గురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎల్లావుల గౌతం యాదవ్ (సిల్వర్ మెడల్) కుక్కల శివ (సిల్వర్ మెడల్) ఎం.కృష్ణవాణి (బ్రాంజ్ మెడల్)లు సాధించారు. భారత్ తైక్వాండో టీమ్‌కు ఎల్లావుల గణేష్ యాదవ్ కోచ్‌గా వ్యవహరించారు. భారత్‌కు పతకాలు సాధించిన క్రీడాకారులను దేశంలోని పలువురు సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

చర్లపల్లి - పాట్నా వీక్లీ స్పెషల్ రైలు పొడిగింపు

కాజీపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : రైల్వే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి - పాట్నా మధ్య నడిచే స్పెషల్ వీక్లీ రైళ్లను పొడిగించి (స్టేషన్ల సంఖ్య పెంపు) నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (03253) పాట్నా - చర్లపల్లి మధ్య నడిచే వీక్లీ స్పెషల్ రైలు సోమ, బుధవారాల్లో ఈ నెల 4 నుంచి 29 వరకు జహనాబాద్ వరకు పొడిగించి నడిపిస్తున్నట్లు చెప్పారు. (07255) చర్లపల్లి - పాట్నా మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారాల్లో ఈ నెల 6 నుంచి సెప్టెంబరు 1 వరకు పొడగించి నడిపించనున్నారు. (07256) చర్లపల్లి - పాట్నా మధ్య ప్రతీ శుక్రవారం నడిచే ఈ వీక్లీ స్పెషల్ రైలు ఈ నెల 8 నుంచి 26 వరకు పొడిగించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. ఈ రైలు సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా నాగపూర్, గోండియా, దర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, జార్సీగూడ, రౌర్కెలా, హాతియా, రాంచి, బొకారో, గోమో, కొడెర్మా, జయా, జెహనాబాద్, రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఆరోగ్యం-విద్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో

చిన్నగూడూరు, ఆగష్టు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల విద్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం ఉగ్గంపల్లి పీహెచ్‌సీ, చిన్నగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి, రికార్డులను, క్షేత్రస్థాయి ఆరోగ్య సర్వే, నివేదికలను తనిఖీ చేసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సాధారణ ప్రసవాలను పోత్సహించాలని మాత, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యానికి సంబంధిచిన ప్రతీ కార్యక్రమం షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని సూచించారు. అనంతరం చిన్నగూడూరు ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, ఆహారం తదితర అంశాలను ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతానికి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్‌లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగానే జిల్లాలో ప్రత్యేక అధికారులను నియమించి నివేదికలను కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్, ఎంపీడీవో కిన్నెర యాకయ్య, ఎంపీవో రజిని తదితరులు పాల్గొన్నారు.



చిన్నగూడూరులో భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

సమస్యలతో విద్యార్థినుల సతమతం

హాస్టళ్లలో సౌకర్యాలపై శ్రద్ధ చూపాలి
మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

చిట్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలోని విద్యార్థినులు సమస్యలతో సతమతం అవుతున్నారని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతివెంకటరమణారెడ్డి దంపతులు మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయా వసతి గృహాల్లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో పారిశుధ్య లోపాలున్నాయని, పిచ్చిమొక్కలతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. వర్షాకాలం, రానున్న చలికాలం దృష్ట్యా హాస్టళ్లలో సోలార్ వాటర్ హీటర్లు, సోలార్ లైట్లు, మెస్‌డోర్లు వెంటనే ఏర్పాటు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు చదువుకోవడానికి స్టడీ రూంలు, ఆడుకోవడానికి క్రీడా మైదానాలు లేవని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా చూడాలన్నారు.

లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, నాయకులు పాండ్రాల వీరస్వామి, పెరుమాండ్ల రవీందర్, దామెర రాజు, రమణాచారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలి

బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్

కృష్ణకాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసిందని, ఇప్పటి వరకు కూడా వాస్తవ లాభాలు ప్రకటించకుండా ఆలస్యం చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని కేటీకే 1వ గనిలో కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాప్యం లేకుండా వెంటనే ప్రకటించి 40 శాతం వాటాను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం కార్మికులు కష్టపడి రికార్డు స్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారని, రూ.40వేల కోట్లు వ్యాపారం జరిగిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అధికంగా బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని స్పష్టం చేశారు.

ఇక సింగరేణి కారుణ్య నియామకాల్లో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని, బోర్డుకు 57 మంది కార్మికులు హాజరైతే కేవ లం ముగ్గురు మాత్రమే ఇన్‌వాలిడేషన్ కావడం విచారకరమన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ పారదర్శకంగా జరగడం లేదని, యాజమాన్యం అనేక విజిలెన్స్ విచారణల పేరుతో కార్మికులకు ఏం న్యాయం చేసిందో సరైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షులు వెలబోయిన సుజేందర్, శ్రీరాములు, రేణికుంట్ల మల్లేష్, రాసకట్ల నరసింహారావు, ర ఘుపతిరెడ్డి, తాండ్ర మొగిళి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

వెంకటాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సొంది వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమరంభీం విగ్రహం ఆవరణలో జరిగిన ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ విభజన వల్ల పార్లమెంట్ నియోజకవర్గం మహబూబాబాద్‌కు వెళ్లిపోవడం వల్ల బంజారా సామాజిక వర్గానికి చెందిన వారే ఎంపీలు అవుతున్నారని అన్నారు. భవిష్యత్‌లో ఎప్పుడు కూడా ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు పోటీ చేసే అవకాశం కనబడడం లేదని తెలిపారు.

గత ప్రభుత్వం బంజారా సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేందుకు కొత్తగూడెం కేంద్రంగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిందని, దేశంలో అన్నివర్గాల కంటే ఆదిమ జాతులే వెనుకబడి పోయారని ఐక్యరాజ్య సమితి సైతం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఆదిమ జాతులు విద్యా రంగంలో ముందుకు సాగేందుకు భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల మంజూరు చేసినట్లయితే భవిష్యత్ తరాలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లేనట్లయితే ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు ఉయిక శంకర్, ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, నాయకులు కుంజ మహేష్, చింత సమ్మయ్య, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రవి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నర్సింహులపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి సెంటర్‌కు వచ్చే రోగులకు త్వరితగతిన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవి రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలోని హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రోగులకు అందుబాటులో ఉంటూ మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలు రికార్డులు రిజిష్టర్లను పరిశీలించారు. అలాగే సబ్ సెంటర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జరుపుల అవినాష్, ఏఎన్ఎంలు ప్రసన్నకుమారి, కృష్ణవేణి, ఆశ కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.



తూము ద్వారా లక్నవరం సరస్సు నీటిని విడుదల చేస్తున్న మంత్రి సీతక్క

రామప్ప నుంచి లక్నవరం వరకు నీటి కాల్వ

రెండు పంటలకు సాగునీరు అందిస్తాం
రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

గోవిందరావుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల కోసం సాగునీటి వనరుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అందులో భాగంగా రామప్ప సరస్సు నుంచి లక్నవరం సరస్సుకు కాల్వ ద్వారా నీటిని అందించడం జరుగుతుందని, రెండు పంటలకు సాగునీరు ఇస్తామని అన్నారు. శుక్రవారం మండలంలోని లక్నవరం సరస్సు నీటిని తూము ద్వారా పంట కాల్వలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రామప్ప నుంచి లక్నవరం వరకు నీటికాల్వను ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా రైతులకు ఏడాదిలో రెండు పంటలకు నీరందే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. చెరువుల్లో నీరు ఉంటే ఊరు పచ్చగా మారుతుందని, అదే స్ఫూర్తితో రైతులకు నీటి కొరత లేకుండా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని రంగాల్లో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మ న్ రేగ కళ్యాణి, ఇరిగేషన్ ఈఈ నారాయణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట ఫాతిమా నగర్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెంది ఉన్నాడు.. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు. ఎరుపు కోలరంగు ముఖం, ఎత్తు 5.5, ఎడమ చేతిపై శివలింగం, ఢమరుకం శూలం పచ్చబొట్టు ఉంది. ఛాతిపై పుట్టుమచ్చ ఉంది. మృతుడి ఒంటిపై ఎలాంటి చొక్క లేదు. బ్లూకలర్ జీన్‌ప్యాంట్ ఉంది. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ప్రయాణికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 87126 58609, 94400 27342 సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

ఆర్ఐలా ? వసూల్ రాజాలా ?

- జీడబ్ల్యూఎంసీలో లంచావతారులు
- పావులుగా మారుతున్న వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు
- ఒక్కో మ్యుటేషన్‌కు రూ.లక్షల్లో వసూళ్లు
- అడిగింది ఇవ్వకపోతే కొర్రీలు
- ఆర్ఐల తీరును పట్టించుకోని అధికారులు



వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు డబ్బులు ఇవ్వనిదే పని చేయరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు, పాలకవర్గం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. 11 మంది ఆర్ఐలలో కొందరు పని చేస్తున్న స్థానంలో మూడు సంవత్సరాలకు మించి పని చేస్తున్నా అదే స్థానంలో స్థిరంగా ఉండేందుకు ప్రజాప్రతినిధులకు డబ్బులిచ్చి మరీ రెన్యువల్ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదంతా బల్దియా ఉన్నతాధికారులు, పాలకవర్గం కనుసన్నల్లోనే వీరు పని చేస్తున్నట్లు బాహాటంగానే చర్చ జరుగుతుంది. గ్రేటర్ పరిధిలో జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో కార్యాలయాల్లో పని చేయాల్సిన వీరు అడ్డదారిలో వచ్చే డబ్బులకు రుచి మరిగి యథా స్థానాల్లోనే తిష్ఠ వేసి అందిన కాడికి దండుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు ఆర్ఐలు తక్కువ కాలంలోనే విలాసవంతమైన ఇళ్లు, భారీగా బ్యాంకు బ్యాలెన్స్ కూడబెట్టినట్టు తెలుస్తోంది. బల్దియా కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో అర్హత కలిగిన సిబ్బందికి ఆర్ఐలుగా అవకాశం ఇవ్వకుండా ఓ సెక్షన్ అధికారి అక్రమార్కులను ప్రోత్సహిస్తూ గడువు దాటినా ఇంకా కొనసాగించడం వెనుక అంతర్యమేమిటని అనుమానాలు రేకెత్తుతున్నాయి. పాత ఆర్ఐలను తొలగించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తుంది.

గ్రేటర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లా.. మజాకా

గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో ప్రజలు ఆన్‌లైన్‌లో ఇంటి నెంబర్ల జారీ (అసెస్‌మెంట్) పాత మ్యుటేషన్లు, ఇంటి పన్నుల వసూలు, ప్రభుత్వ సర్వేలు నిర్వహించాలి. కానీ వారు నిర్వహించే అన్ని డ్యూటీలను వదిలి అడ్డదారిలో వచ్చే అసెస్‌మెంట్‌పై ఎక్కువ మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా మిగతా డ్యూటీలను కింది స్థాయి బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్ల ద్వారా చేయిస్తున్నారు. కొందరు ఆర్ఐలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వారి వద్ద పని చేస్తున్న బిల్ కలెక్టర్లు, కొత్త వార్డు అధికారులను పావులుగా వాడుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇద్దరు ఆర్ఐలు ఫోన్ పే చేయించుకుని ఫిర్యాదుదారులకు అడ్డంగా దొరికిపోయినట్లు తెలిసింది. వరంగల్ విలీన గ్రామాలకు చెందిన ఓ ఆర్ఐ ఓ వ్యక్తి నుంచి రూ. 20 వేలు ఫోన్‌పే చేయించుకుని ఇంటి నెంబర్ ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టినట్టు బాధితులు తెలిపారు. అన్నదమ్ముల ఆస్తుల బైవెరిఫికేషన్ చేసేందుకు ఓ ఆర్ఐ మధ్యవర్తి ద్వారా ఏకంగా రూ. 1 లక్ష డిమాండ్ చేసి రూ. 50 వేలు తీసుకుని పని చేసినట్లు తెలిసింది. ఓ మహిళా ఆర్ఐ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుని ఒకే ఇంటికి రెండు నెంబర్లు జారీ చేసి చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అధికారులు చుట్టు తిరిగినట్లు తెలిసింది. కొందరు బిల్ కలెక్టర్లు ఆన్‌లైన్ పేమెంట్‌తో పాటు అదనంగా లంచం ఇచ్చిన ఇంటి నెంబర్ ఇస్తున్నట్లు తెలిసింది. పని కోసం లంచం తీసుకుని కొర్రీలు పెడుతుండడంతో కొందరు బాధితులు గ్రేటర్ ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడం గమనార్హం. చాలాకాలంగా కొందరు ఆర్ఐలు ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లను ఏర్పాటు చేసుకుని అక్రమ సంపాదనకు తెరలేపి కోట్లు కొల్లగొట్టినట్లు సమాచారం. ఇదంతా బల్దియా ఉన్నతాధికారులకు తెలియదా ? అంటే ప్రతీ నెల ఇచ్చే మామూళ్లతో నిద్రమత్తు నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

అవీ.. ఇవీ లేవంటూ ఆఫీస్ చుట్టూ తిప్పిస్తూ..

వరంగల్ నగర పరిధిలో 11 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తున్నారు. వారి వద్ద డివిజన్ల పరిధిని బట్టి 5 నుంచి 8 మంది బిల్ కలెక్టర్లు, వార్డ్ అధికారులు పని చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో 66 మంది బిల్ కలెక్టర్లు పని చేస్తుండగా ఇటీవల కొత్తగా కార్పొరేషన్‌కు కేటాయించిన గ్రూప్ -4 అధికారులను సైతం వార్డు అధికారులుగా నియమించారు. యజమానుల పేరు మార్పు, బైవెరిఫికేషన్, కొత్త ఇంటి నెంబర్లు, వీఎల్‌టీ (వెకెట్ ల్యాండ్ ట్యాక్స్) తదితర పనులు చేసేందుకు నియమించారు. ఇందుకు ప్రజలు ఆన్‌లైన్ ద్వారా వారికి అవసరం ఉన్న పనిని బట్టి చలానా ద్వారా డబ్బులు చెల్లించి పని కోసం ఎదురు చూస్తుంటారు. కానీ కొందరు ఆర్ఐలు చేయి తడపనిదే పని చేయబోమని మొండికేస్తున్నారు. దరఖాస్తు పత్రాలు సరిగా లేవని కొర్రీలు పెడుతున్నారు. కొందరు ఆర్ఐలు చేతికి మట్టి అంటకుండా బిల్ కలెక్టర్లను రంగంలోకి దింపి దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ చేయిస్తున్నారు. పలానా దరఖాస్తు ప్లాన్‌లో తప్పులున్నాయి.. డాక్యుమెంట్లు సరిగా లేవని, హద్దులు సరిగా లేవని, రోడ్డు వెడల్పు సరిగా లేదని, కుటుంబ సభ్యుల నుంచి ఎన్‌వోసీ తేవాలని ప్రశ్నల వర్షం కురిపిస్తూ దరఖాస్తు రద్దు చేస్తున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇలా డబ్బులు ఇచ్చే వరకు పట్టి పీడిస్తున్నారు. పని చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. డబ్బులు ఇస్తాము పని చేయండి బాబోయ్.. అనే వరకు తిప్పుకుంటారు. ఇలా ఇంటి నెంబర్‌కు కనీసం రూ. 50 నుంచి రూ. 1 లక్ష వసూలు చేస్తుండగా మిగతా వాటికి పనిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆరుగురు ఆర్ఐలు ఒకేచోట 10 సంవత్సరాలుగా పాతుకుపోయి అక్రమ వసూళ్ల దందా కొనసాగిస్తూ కోట్లు సంపాదించినట్టు తోటి ఉద్యోగులే ఆరోపిస్తున్నారు.

భూపాలపల్లికి బైపాస్ రోడ్డు

- ఫలించిన ఎంపీ కావ్య కృషి
- వార్షిక ప్రణాళికలో నిధుల కేటాయింపు
- త్వరలో డీపీఆర్, టెండర్ పనులు పూర్తి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ కడియం కావ్య (ఫైల్)

హనుమకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరైంది. వరంగల్ ఎంపీ కడియం కావ్య కృషి ఫలించింది. ఈ రోడ్డు విషయమై ఎంపీ పలుమార్లు కేంద్ర రోడ్డు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రాలు అందజేశారు. భూపాలపల్లి పట్టణంలో ప్రధానంగా భారీ ట్రాఫిక్, బొగ్గు రవాణా, పవర్‌ప్లాంట్ కార్యకలాపాల వల్ల ఎన్‌హెచ్-353సీ పైన వాహనాల రద్దీ పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, డాక్టర్ కావ్య కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మూడేళ్లలో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. దీన్ని నివారించడానికి భూపాలపల్లి పట్టణాన్ని దాటి వెళ్లే వాహనాల కోసం బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. రూ.250కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బైపాస్ రోడ్డులో రూ.175కోట్లు నిర్మాణ పనులకు, రూ.75కోట్లు భూసేకరణకు వినియోగించాలని, ఈ నిధుల మంజూరును 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ ఎన్‌హెచ్-353సీపైన భూపాపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చినట్టు డాక్టర్ కావ్యకు రాసిన లేఖలో పేర్కొన్నారు. డీపీఆర్‌ను, టెండరు పనులను పూర్తి చేస్తామని డాక్టర్ కావ్యకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల భూపాలపల్లి పట్టణ ప్రజల సమస్యలు తీరనున్నాయన్నారు.

గానమే ఆమె గమనం

- ఉత్తమ సింగర్‌గా జాతీయస్థాయి అవార్డు
- 2 వేలకు పైగా పాటలు పాడి ప్రజల మెప్పు
- తన గాత్రంతో ఉర్రూతలూగిస్తున్న వాణిశ్రీ
- వృద్ధాశ్రమం నెలకొల్పేందుకు అడుగులు


ఓ ఈవెంట్‌లో పాట పాడుతున్న వాణిశ్రీ

పరకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తన కంఠంతో వేలాది ప్రజల ముందు పాటలు పాడుతూ ప్రజల మెప్పు పొందాలని చిన్నతనం నుంచి ఒక లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది పరకాల పట్టణానికి చెందిన వేమునూరి వాణిశ్రీ. చిన్నచిన్నగా పాఠశాల స్థాయి నుంచి పాటలు పాడుతూ నేడు ఉత్తమ సింగర్‌గా నేషనల్ అవార్డు అందుకోబోతోంది.

భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన వేమునూరి లక్ష్మణాచారి - వనజ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వాణిశ్రీ, కల్యాణి, స్రవంతి, కుమారుడు నాగరాజు ఉన్నారు. వృత్తిరీత్యా వడ్రంగి కావడంతో గ్రామంలోని కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వాణిశ్రీ డిగ్రీ వరకు చదివింది. శాయంపేట మండలం ప్రగతి సింగారానికి చెందిన వీరబ్రహ్మాచారితో 2002లో వాణిశ్రీకి వివాహం జరిపించారు. అప్పట్లో కొద్దో గొప్పో పాటలు పాడే వాణిశ్రీ.. భర్త సహకారంతో పరకాల పట్టణానికి చెందిన బండి సమ్మయ్య, కుమారస్వామి బృందంలో చేరి వివాహ, శుభ కార్యాలకు ఈవెంట్ చేసేందుకు వెళ్తుంది. ఇప్పటి వరకు సుమారు 2వేలకు పైగా పాటలు పాడింది. మొట్టమొదటగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పరకాల పట్టణంలో 'నీ దర్మం మరువొద్దు.. ఈ సం ఘం మరవద్దు' అనే పాటను పాడి రూ.4,116 బహుమతి అందుకున్న వాణిశ్రీ.. అప్పటి నుంచి ఇప్పటి వరకు వెనుతిరగలేదు.


గాయని వాణిశ్రీ

వృద్ధాశ్రమ ఏర్పాటుకు ప్రయత్నం

చేయూత ఫౌండేషన్ ద్వారా ఒక వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి వృద్ధులకు చివరి దశలో మంచి జీవితాన్ని అందించాలనే లక్ష్యంగా వాణిశ్రీ అడుగులు వేస్తోంది. ప్రస్తుతం సామాజిక సేవల్లో పాల్గొంటుంది. సరైన సహకారం, ప్రోత్సా హం ఉన్నతాధికారులతో పాటు, ప్రభుత్వం అండదండలు అందిస్తే పరకాల పట్టణ ప్రాంతంలో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి అనాథ వృద్ధులకు సేవ చేస్తానని వాణిశ్రీ పేర్కొంటోంది.

జాతీయస్థాయి అవార్డుకు వాణిశ్రీ ఎంపిక

ఈ నెల 11న ఉత్తమ సింగర్‌గా నేషనల్ అవార్డు వాణిశ్రీ అందుకోనున్నారు. హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్ అనే సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఉత్తమ సింగర్‌గా ప్రముఖుల చేతులమీదుగా వాణిశ్రీ అవార్డు స్వీకరించనున్నట్లు తెలిపారు.


డాక్టర్ హరికిషన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, వైద్యులు

ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా హరికిషన్

గిర్మాజీపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె. హరికిషన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ జి.పద్మావతి గురువారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో జె.హరికిషన్‌ను నియమిస్తూ తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అశోక్ కుమార్, ఆయుర్వేద విభాగాల అధిపతులు డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ దుర్గాబాయి, డాక్టర్ విజయగణేష్ రెడ్డితో పాటు అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు హరికిషన్‌కు అభినందనలు తెలిపారు.

కూరగాయల సాగు.. లాభాలు బహు బాగు

- రాయితీలు అందిస్తున్న ప్రభుత్వం
- సద్వినియోగించుకోవాలంటున్న ఉద్యాన శాఖ అధికారులు


రైతులకు బిందు సేద్యం కోసం అందించిన డ్రిప్ పరికరాలు

భీమదేవరపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులకు కూరగాయల సాగుకు వివిధ పథకాలతో రాయితీలు అందిస్తోంది. కూరగాయల సాగుకు ఇచ్చే రాయితీల గురించి హనుమకొండ ఉద్యాన శాఖాధికారి సుస్మిత వివరించారు.

కూరగాయల నారు

టమాటా, వంకాయ, పచ్చి మిర్చి నారు రైతులకు వంద శాతం రాయితీపై అందజేస్తారు. ఐదెకరాలలోపు ఉన్న ప్రతి రైతు కూరగాయల నారును ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నారు. రైతులు తమకు అవసరం ఉన్న నారు వివరాలను 30 రోజుల ముందు తెలియజేస్తే వారికి వంద శాతం రాయితీతో కూరగాయల నారును అందిస్తామన్నారు. రైతులు ఇందు కోసం పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ పత్రాలతో ఉద్యాన శాఖాధికారులను సంప్రదించాలి.

శాశ్వత పందిళ్లు

కూరగాయాల్లో బీర, కాకర, మొదలైన తీగజాతీ కూరగాయల సాగు కోసం ఉద్యాన శాఖ శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం రాయితీ ఇస్తుంది. 50 శాతం రాయితీలు ఇస్తున్నారు. ఒక యూనిట్‌కు 50వేల రాయితీతో పాటు రెండున్నర ఎకరాలు రైతుకు ఉండాలి.

మల్చింగ్ విధానం

కూరగాయల సాగులో ముఖ్యంగా కలుపుతీత రైతులకు ప్రధాన సమస్య. ఈ సమస్యను అధిగమించడానికి మల్చింగ్ విధానాన్ని ఉద్యాన శాఖ అందిస్తుంది. ఎరువుల యాజమాన్యం తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి చేయడానికి మల్చింగ్ విధానం ఉపయోగపడుతుంది. ఎకరాకు రూ. 8వేల రాయితీని, ఐదెకరాల వరకు అందిస్తుంది. ఊతం విధానాల్లో టమాట, ఇతర కూరగాయాల పంటలు సాగు చేయడానికి రాయితీ సదుపాయం కల్పిస్తున్నారు. ఒక ఎకరానికి రూ. 10వేల చొప్పున ఈ రాయితీ ఇస్తున్నారు.

బిందు సేద్యం

తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేందుకు ఉద్యాన శాఖ ద్వారా బిందు సేద్యం పథకాన్ని రైతులకు అందిస్తున్నారు. బిందు సేద్యం ఇతరులకు 80శాతం, బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 90శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ అందిస్తున్నారు. అలాగే తుంపర్ల సేద్యం కోరుకునే రైతులు 75శాతం రాయితీ అన్ని కేటగిరీల రైతులకు అందజేస్తారు. బోర్, బావి నీటి వసతి ఉన్న రైతులు తుంపర్ల సేద్యంకు అర్హులన్నారు. రైతులు ఈ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. అవసరం ఉన్న రైతులు ఉద్యాన శాఖాధికారులను సంప్రదించాలని కోరారు. సంబంధిత వివరాల కోసం 8977714068 హనుమకొండ ఉద్యాన శాఖాధికారి సుస్మితను సంప్రదించాలని కోరారు.


మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న రైతు

ఒకవైపు కొరత.. మరోవైపు ప్యాకేజీ

- యూరియా కోసం రైతుల అగచాట్లు
- ఖరీదైన ఫెస్టిసైడ్లూ కొనాలని డిమాండ్
- అన్నదాతలపై పెరుగుతున్న ఆర్థిక భారం



హనుమకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతున్న వేళ.. రైతులపై ఆర్థిక భారం పడుతోంది. జిల్లాలో 14 మండలాల్లో అన్నదాతలు పత్తి సాగుతో పాటు వరి నార్లు పోసుకుంటున్నారు. పత్తి, మొక్కజొన్న ఇతర కూరగాయల పంటలకు యూరియాను రైతులు ఎక్కువ ఉపయోగిస్తుంటారు. జిల్లాలో 20 రోజులుగా యూరియా కొరత ఏర్పడింది. రైతులు యూరియా కోసం వెళ్తే ఇతర ఖరీదైన ఎరువులు తీసుకోవాలని డీలర్లు, వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు మౌనం పాటిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువ

యూరియా ఎమ్మార్పీ రూ.266 లభించాల్సి ఉండగా రూ.350నుంచి రూ.400 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. యూరియాతో పాటు ఇతర రసాయనాల ధరతో కలిపి చూస్తే రూ.600 నుంచి 700 వరకు ఒక బస్తాకు చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు రైతుల వద్ద వసూలు చేస్తున్నారని, వాటికి యూరియాకు బిల్లులు ఇవ్వడం లేదని, ఇతర ఎరువులు కలిపి తక్కువ బిల్లులు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

అధికారుల మౌనం

ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తున్నారని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు సమయానికి ఎమ్మార్పీ ధరకే యూరియాను అందించాలని, అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు కలుగకుండా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత



హనుమకొండ జిల్లావ్యాప్తంగా పంటల సాగుకు యూరియా సరిపోవడం లేదని క్యూలో ఉన్న ఒక్కో రైతుకు రెండు బస్తాలు అందిస్తున్నారు. దీంతో కొంతమంది డీలర్లు, ఇతర రిటైల్ వ్యాపారులు యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించి గోదాములలో నిల్వ చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన యూరియా స్టాక్‌ను ప్రైవేటు డీలర్లు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్

జిల్లాలో యూరియా కొరత లేదు. కొంత మంది కావాలని కొరత ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు. రైతులు అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. కిందటేడు కంటే ఈ యేడు ఇప్పటికే 800 మెట్రిక్ టన్నుల ఎక్కువ యూరియా అమ్మకాలు పెరిగాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

హమాలీ.. కళల మాలి

తనకు చిన్నప్పటి నుంచి పాటలంటే ప్రాణం. గురువు బాబు వద్ద మెళకువలు నేర్చుకుని ప్రజా నాట్యమండలి కళాకారుడిగా ప్రస్థానం మొదలుపెట్టాడు. నటుడిగా, ఉద్యమకారుడిగా, సామాజిక కార్యకర్తగా, నర్తకుడిగా, పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ ప్రజలు, పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. సొంతంగా పల్లె పాటలను అల్లుకుని వరకట్న దురాచారం, మద్యపానం, నిరక్షరాస్యతపై ప్రజలను చైతన్య పరుస్తున్నాడు. కళామతల్లికి సేవ చేస్తూనే తన పొట్ట కూటి కోసం కూలి పనులు చేస్తున్న ప్రజా కళాకారుడు, వాగ్గేయకారుడు అయిన దామెర కృష్ణ ప్రస్థానంపై ఈ ప్రత్యేక కథనం.

- గాయకుడిగా, కళాకారుడిగా తనదైన ముద్ర చాటుతున్న దామెర కృష్ణ
- ప్రజా నాట్యమండలి తరఫున చురుకైన పాత్ర
- సాంఘిక దురాచారాలపై ప్రజల్లో చైతన్యం
- కార్మిక సంఘం నాయకుడిగా సమస్యలపై పోరు


కళాకారులతో కలిసి ప్రదర్శన ఇస్తున్న దామెర కృష్ణ


రవీంద్రభారతిలో గద్దర్ పురస్కారాన్ని డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాష్ నుంచి అందుకుంటున్న దామెర కృష్ణ

వరంగల్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కళాకారుడిగా, ప్రజా నాయకుడిగా, వాగ్గేయకారుడిగా రాణిస్తున్న దామెర కృష్ణ వరంగల్ జిల్లా దామెర మండల కేంద్రానికి చెందిన దామెర కమలమ్మ, ఆగయ్య దంపతులకు రెండో సంతానంగా 1970లో జన్మించారు. తన చిన్నతనంలో తండ్రి మృతి చెందాడు. తల్లి కమలమ్మ అన్ని తానై కృష్ణను డిగ్రీ వరకు చదివించింది. తనకు పాటలపై ఉన్న మక్కువతో గురువు బాబు వద్ద జానపద కళల్లో మెళకువలు నేర్చుకున్నాడు.



కార్మికుడు.. నాయకుడిగా..

1996లో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పడిన ఎస్ఆర్‌నగర్ కాలనీకి మూడు సార్లు శాఖ కార్యదర్శిగా పనిచేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా పని చేశారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యుడిగా పనిచేశారు. 2019లో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో హమాలిగా చేరి హమాలి వర్కర్స్ యూనియన్‌ను స్థాపించడమే కాకుండా ప్రధాన కార్యదర్శిగా కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు చేశారు. ప్రస్తుతం ఏఐసీటీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా పని చేస్తున్నారు.

కళాకారుడిగా..

సామాజిక రుగ్మతలపై తన గానామృతంలో ప్రజలను చైతన్య పరుస్తున్నారు. బుర్రకథ, హరికథలతో పాటు మద్యపానం, వరకట్నం, నిరక్షరాస్యత, పల్లెపాటలను అల్లుకుని వందలాది ప్రదర్శనలిచ్చారు. తెలంగాణ మలి ఉద్యమంలో తన ఆట పాటలతో ప్రజలను ఉర్రూతలూగించారు. గజ్జెకట్టి గళమెత్తి చలో ధూం..ధాం...అంటూ యువతను మేలుకొల్పారు. మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగర హారం వంటి కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. స్వరకర్తగా కళాబృందాన్ని నడిపించే నాయకుడిగా, నర్తకుడిగా, నటుడిగా ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

అందుకున్న అవార్డులు.. ప్రశంసలు

2016లో జ్యోతిరత్న అవార్డును అందుకున్నారు. 2019లో ఎన్‌టీఆర్ లైఫ్ టైం అవార్డు, జాతీయ స్థాయి కళారత్న అవార్డు, కళా వాచస్పతి, జానపద కళారత్న అవార్డులను అందుకున్నారు. 2023లో విమలక్క చేతుల మీదుగా ఉత్తమ నంది అవార్డును సొంతం చేసుకున్నారు. 2024లో గాన కోకిల, 2025లో భారత్ విభూషణ్, గద్దర్ పురస్కారం అందుకున్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 2.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా, బ్యారేజీ వద్ద నీటి మట్టం 3.30 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది.

నేడు మండలంలో పర్యటించనున్న మంత్రి

మల్హర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో శనివారం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. తాడిచర్లలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రూ.25లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని, రూ.40లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని, రూ.12లక్షలతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. రూ.12లక్షలతో నిర్మాణం చేపట్టనున్న తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కాగా, పనులను శుక్రవారం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పరిశీలించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చిట్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నైన్‌పాక, గోపాలపురం, చిట్యాలలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ డివిజనల్ అధికారి ఎన్.రమేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గోదాంలను పరిశీలించి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎరువుల బస్తాల నిల్వ, ధరలను పట్టికలో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవోలు సుమంత్, రమణకుమార్ ఉన్నారు.

వృద్ధుడిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు

కాటారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపల్లిలో కొండి రాజయ్య అనే వృద్ధుడిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన రాజేష్, సరోజనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మూడు ఎకరాల భూమి విషయంలో పంచాయతీ జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాజేష్, సరోజన అకారణంగా పరుష పదజాలంతో తిట్టి, కొట్టినందున పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిద్దరిపై కేసు నమోదైనట్లు కొండి రాజయ్య తెలిపారు.

ఇసుక టిప్పర్, ఎక్స్‌కావేటర్ సీజ్

కాటారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామం నుంచి శుక్రవారం తెల్లవారుజామున అక్రమ డంప్ నుంచి ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేసి వరంగల్‌కు తరలించే క్రమంలో టిప్పర్‌తో పాటు ఎక్స్‌కావేటర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు కొత్తపల్లి గ్రామానికి వెళ్లగా టిప్పర్‌లో ఎక్స్‌కావేటర్‌తో లోడ్ చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ ఘటనపై డ్రైవర్లు, ఓనర్లు, ఇసుక తరలిస్తున్న వ్యక్తితో సహా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఏటూరునాగారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎమ్డీ.దావూద్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల రుణమాఫీ కోసం రైతులు లక్షలు అప్పులు తెచ్చారని, కానీ రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇంతవరకు చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ సమసమ్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని దావూద్ కోరారు.

ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఏటూరునాగారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు వారిఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో శ్రీను, పంచాయతీ రమాదేవిని కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పారిశుధ్యం, దోమల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఖలీల్‌ఖాన్, జిల్లా యూత్ కార్యదర్శి ఎమ్డీ.గౌస్ పాషా, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ సునార్కని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

మల్హర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం పోటీలకు మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి అజ్మీర భవానీప్రసాద్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణచందర్, పీడీ పక్కల రాజబాబులు శుక్రవారం తెలిపారు. గత నెల 29న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 3, 4 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

- వెంకటాపూర్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మైనారిటీ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్కే.రేష్మ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వందన శుక్రవారం తెలిపారు. జూలై 27న ములుగు మండలం జాకారంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరగగా 60 మీటర్ల పరుగు పందెంలో రేష్మ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందని అన్నారు. ఈనెల 3, 4 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు.

శ్యామ్ పాటకు పట్టం

(5వ పేజీ తరువాయి)

విశేషం. వంద సినిమాల్లో ఇప్పటి వరకు సుమారు 280కి పైగా పాటలు రాశారు. శ్రీకాంత్ హీరోగా 2009లో విడుదలైన మహాత్మా సినిమాలో శ్యామ్ రాసిన 'నీలపూరి గాజుల ఓ నీలవేణి' పాట మొదలు.. 2020లో అలా వైకుంఠపురం సినిమాలో 'రాములో రాములా..' పాటకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అదే విధంగా 2022లో డీజే టిల్లు, 2023లో దసరా సినిమాలో 'చమ్కీలా అంగిలేసి' పాట ప్రేక్షక ఆదరణ పొందాయి. కృష్ణవంశీ, రాంగోపాల్‌వర్మ మొదలు అనేక మంది ప్రసిద్ధ దర్శకుల సినిమాల్లోనూ ఆయనకు అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి.

హనుమకొండ బ్రాహ్మణవాడలో ప్రముఖ రంగస్థల నటుడుగా పేరొందిన మధుసూదన్‌రావు, మాధవి దంపతులకు జన్మించిన శ్యామ్ వరంగల్‌లో శంకర్, సారంగపాణి బృందంలో అనేక కార్యక్రమాలతోపాటు వినాయకచవితి వేడుకల్లో తన పాటలతో నగరవాసులను అలరింపజేశారు. చిన్నప్పటి నుంచే సాహిత్యంపట్ల అభిలాషఉన్న శ్యామ్.. సినిమాల్లోకి రాకముందు 50 ఆల్బమ్స్ రూపొందించాడు. అందులో కాలేజీ పిల్లచూడరో.. యమ ఖతర్‌నాక్ ఉందిరో.. అన్న ఓ జానపద ఆల్బం ఆ రోజుల్లోనే పెద్ద హిట్ అయ్యి శ్యామ్‌ను పరిశ్రమ వైపు దృష్టి మళ్లించేలా చేసింది. కిందటేడు సారంగి ఫిల్మ్ అవార్డుతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు, అనేక అవార్డులతో శ్యామ్‌ను సత్కరించాయి.

ఓరుగల్లు మట్టి పరిమళమే..

ఓరుగల్లు మట్టి పరిమళమే తన పాట సాహిత్యానికి పునాది అని కాసర్ల శ్యామ్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. తాను రాసిన పాటకు జాతీయ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనకు సాహిత్యంలో, సంగీతంలో ఓనమాలు నేర్పిన శంకరన్న, సారంగపాణిల సహచర్యం సాహిత్య అభిలాష సినీ గేయరచయితగా తనకో స్థానం కల్పించాయని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తిచేయాలి

▸▸ జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేట గ్రామంలోని చిన్నగుంటూర్‌పల్లి, అన్నంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని, ప్రతి ఇంటి నిర్మాణాన్ని నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామక్రిష్ణ, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



జగ్గన్నపేటలో ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థులకు వసతులు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ దివాకర అన్నారు. మండలంలోని దేవగిపట్నం మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది, సరుకులు భద్రపరిచే గది, విద్యార్థులు నిద్రించే గదులను తనిఖీ చేశారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించి ప్రభుత్వం ఇచ్చిన కామన్ డైట్ మెనూను అమలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను ఇంగ్లీష్‌లో ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నీతి అయోగ్ అంశాలు గొత్తికోయలకు చేరాలి

నీతి అయోగ్ సూచించిన 6 అంశాలను చిట్టచివర ఉన్న గొత్తికోయ గూడాలకు అందించాలని కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కన్నాయిగూడెం ఆకాంక్ష బ్లాక్, సంపూర్ణ అభియాన్ సమ్మాన్ సమారోహ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన దేశంలోని 500 బ్లాక్‌లలో కన్నాయిగూడెం బ్లాక్ ఒకటని అన్నారు. సమష్టి కృషి ఫలితంగా అభివృద్ధి సూచికలలో గణనీయమైన ప్రగతిని సాధించామని తెలిపారు. సంపూర్ణత అభియాన్ అంటే కేవలం లక్ష్యాలను చేరుకోవడం కాదని ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలో సంపూర్ణ అభివృద్ధిని సాధించడమని తెలిపారు. ఇది ప్రభుత్వ అధికారులు, ఫ్రంట్ లైన్ వర్కర్‌లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరి సహాయ సహకారాలతోనే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకట నారాయణ, ఎంపీడీవో అనిత, ఎంపీవో సాజిద తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి పనుల్లో వేగం పెంచాలి

మల్హర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి పనుల్లో వేగం పెంచాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తాడిచర్లలో పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయంలో సాగుతున్న భూ భారతి పనుల్లో వేగం పెంచాలన్నారు. అలాగే పక్కనే ఉన్న ప్రభుత్వాసుపత్రిని సందర్శించి వైద్యాధికారితో మాట్లాడారు. సిబ్బంది పనితీరు, వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, వైద్యాధికారులు వినయ్‌భాస్కర్, రాజు, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం ఉద్యమించాలి

మంగపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజుపేట, రామచంద్రునిపేట, మల్లూరు సర్కిల్ పరిధిలో గల అంగన్‌వాడీకేంద్రాల్లో పనిచేస్తున్న 100మంది టీచర్లు, ఆయాలు రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.సమ్మక్క సమక్షంలో శుక్రవారం సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సరిత, భాగ్యలక్ష్మి, లక్ష్మినర్సింహ, మల్లికార్జున, ప్రభావతి, రమ,వెంకటనర్సమ్మ, తార, వాణిశ్రీ, నాగలక్ష్మి, వెంకాయమ్మ, ఆదిలక్ష్మి, వజ్ర, భాగ్య పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాల తనిఖీ

కృషకాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లిలోని సింగరేణి పాఠశాలను సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలను, టాయిలెట్లను పరిశీలించారు. పరిసరాలన్నీ సౌకర్యవంతంగా, శుభ్రంగా లేని కారణంగా అసహనం వ్యక్తం చేసి వారిని మందలించారు. అసలే వర్షాకాలమని, శుభ్రత పాటించాలని సూచించారు. మళ్లీ తనిఖీకి వచ్చిన సమయంలో అపరిశుభ్రత కానవస్తే చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి

వెంకటాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బీసీమర్రిగూడెంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం... బీసీమర్రిగూడెం పంచాయతీలోని కార్మికుడు విజయ్(33) శాంతినగర్ పాఠశాలలో ఫ్యాన్ బిగిస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడని అన్నారు. గమనించిన గ్రామస్థులు విజయ్‌ను మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



విజయ్ (ఫైల్)

న్యాయం చేయాలని రాస్తారోకో..

పంచాయతీ కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మండలకేంద్రంలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి మాట్లాడుతూ పంచాయతీ కార్మికుడు విజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు సంఘటన వద్దకు చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో పంచాయతీ కార్మికులు ఆందోళనను విరమించారు.

జీజీహెచ్‌లో సిటీ స్కాన్ ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్‌లో సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో సిటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సమయానుకూలంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిటీ స్కాన్ పరికరం ఏర్పాటును త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. పనుల్లో ఆలస్యం లేకుండా సంబంధిత ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సిటీస్కాన్ యంత్రం ఏర్పాటుతో ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో ఏర్పాటు చేయనున్న సిటీ స్కాన్ మిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

రెవెన్యూ, అటవీ భూ సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్ మండలాల్లో నెలకొన్న రెవెన్యూ, అటవీ శాఖల భూ సమస్యపై ఆ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం వల్ల భూముల వివాదాలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించేందుకు ఇరు శాఖల అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మండలానికి చెందిన వివాదాస్పద భూముల వివరాలను సమగ్రంగా విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే స్థలాన్ని సందర్శించి భౌగోళిక పరంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఫ్‌డీవో సందీప్‌రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి

వాజేడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... మండలంలోని లక్ష్మీపురంలో గుండెబోయిన సరోజినికి చెందిన రెండు పాడి గేదెలు గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేతకు వెళ్లాయి. అప్పటికే విద్యుత్‌తీగలు తెగి పడి ఉండడంతో గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితురాలు తెలిపారు. పాడిగేదెలను వెటర్నరీ డాక్టర్లు పరిశీలించగా సంఘటనా స్థలిని విద్యుత్ శాఖ అధికారులు సందర్శించి నష్టపరిహారం నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియజేశారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపించాలి

కన్నాయిగూడెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు భాషా పరంగా వెనకబడి ఉన్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా ప్రత్యేక టీం కౌన్సిలర్ రాణి ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం టీం సభ్యులు స్రవంతి, సంజీవ్‌తో కలిసి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి మాట్లాడారు.

అధికార దుర్వినియోగం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అధికార దుర్వినియోగానికి పాల్పడితే ప్రజలేతగిన గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో నివాసం ఉంటున్న కూరాకుల ఓదెలుకు చెందిన గేదెల షెడ్డును మునిసిపల్ అధికారులు కూల్చివేయగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అధికారం ఉంది కదా.. అని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. ఒక ప్రజాప్రతినిధి చెప్పినట్లు విని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న పోలీసు అధికారులు తన యూనిఫాంను తీసి పక్కకు వేయాలని హెచ్చరించారు. ఈ జిల్లాలో అసలు ఎస్పీ ఉన్నారా..? అని ప్రశ్నించారు. ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం సరైందికాదని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. కాగా, బాధిత కుటుంబం మంజూర్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు పూనుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, మునిసిపల్ కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

ఎమ్మెల్యేకు సంబంధం లేదు.. : కాంగ్రెస్

భూపాలపల్లిటౌన్: మంజూర్‌నగర్‌లో కారుకూరి ఓదెలు షెడ్డు కూల్చివేతకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఎటువంటి సంబంధం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. మంజూర్‌నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు మునిసిపల్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు. అయితే ఓదెలు అనే వ్యక్తికి చెందిన గేదెల షెడ్డును అధికారులు తొలగిస్తే రాజకీయంగా లబ్ధి చేకూర్చుకునేందుకు గాను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కావాలనే బాధితుడితో గేదెలను క్యాంపు కార్యాలయంలోకి తీసుకువెళ్లేలా చేశారని ఆరోపించారు. తమ ఎమ్మెల్యేకు కుట్రలు, కుతంత్రాలు లేవని స్పష్టం చేశారు. అదే బీఆర్ఎస్ పాలనలో అవినీతి ఎంత జరిగిందో ప్రజలకు బాగా తెలుసని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా స్థానిక ఎన్నికల్లో విజయం తమదేనని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, నాయకులు అప్పం కిషన్, దాట్ల శ్రీనివాస్, తోట రంజిత్, రజినీకాంత్, రేణుక, మహేందర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం..పచ్చదనం జాడేదీ..?

(5వ పేజీ తరువాయి)

మెప్మా ఆధ్వర్యంలో కాశీంపల్లిలో నర్సరీని ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోతుంది. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కాగితాలకే ప్రణాళికల పరిమితం

వంద రోజులు ప్రణాళిక ప్రకారం పట్టణంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలు చేయాల్సి ఉంది. కానీ, అలా జరగడం లేదు. మురికినీటి కాలువలు శుభ్రం చేయాలి. మంచినీటి కనెక్షన్లను ఆన్‌లైన్‌లోకి నవీకరించాలి. మైకుల ద్వారా ప్రకటనలు చేయాలి. సోషల్ మీడియా ప్రచారాలు లేవు. గృహాల వద్ద అవగాహన కార్యక్రమాలు లేవు. గోడ చిత్రాలతో అవగాహన కల్పించడం లేదు. రోడ్ల పక్కన శిథిలాల తొలగింపు లేదు. మొక్కలు నాటించే కార్యక్రమాలు లేవు. వర్షపు నీటి నిల్వల కోసం నిర్మాణాలు లేవు. తాగునీటి మూలాల శుభ్రత, దోమల నివారణ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించడం లేదు. ఆయిల్ బంతులు తయారీ, విడుదల లేవు. ఇలా వంద రోజుల పాటుకార్యక్రమాలు చేయాల్సిఉండగా విస్మరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

– మధుసూదన్, జిల్లా వైద్యాధికారి

సహజంగానే వర్షాలు, వరదల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అలాంటి కేసులను సకాలంలో గుర్తించి అదుపు చేసేందుకు పూర్తిస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేశాం. వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు మందులను అందుబాటులో ఉంచాం. అలాగే జిల్లాలోని వివిధ శాఖల సమన్వయంతో పారశుధ్యకార్యక్రమాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం.

పనులు జరుగుతున్నాయి..

– బిర్రు శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్

భూపాలపల్లి పట్టణంలో వంద రోజుల ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాం. కాలనీల్లో ప్రస్తుతం కాలువల శుభ్రం చేసే పనులు జరుగుతున్నాయి. పిచ్చిమొక్కలు సైతం తొలగిస్తున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు.

మహదేవపూర్ ఎంపీడీవోగా రవీంద్రనాథ్

మహదేవపూర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ ఎంపీడీవోగా రవీంద్రనాథ్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వెంకటేశ్వర్లు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రవీంద్రనాథ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతాపూర్ కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ప్రవేశం కోసం ములుగు, భూపాలపల్లి జిల్లాల గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లాకు ఆరు సీట్లు, భూపాలపల్లి జిల్లాకు ఆరు సీట్లు కేటాయించడం జరిగిందని, ఇందులో బాలురకు మూడు, బాలికలకు మూడు సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులను ఐటీడీఏలోని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 8వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని వివరించారు. ఒక కుటుంబంలో ఒకరిని మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

తీశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం, ఐసీటీసీ సెంటర్, రక్తనిధి కేంద్రాన్ని, ప్రసూతివార్డును సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, ములుగు డీసీహెచ్ డాక్టర్ జగదీష్, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఏటూరునాగారం రూరల్: ఇటీవల కురిసిన వర్షాల దృష్ట్యా ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని షాపల్లిలో గల అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమికపాఠశాలను తనిఖీ చేశారు. గ్రామంలో డెంగీతో బాధపడుతున్న వ్యక్తి వద్దకు వెళ్లి వివరాలు అడిగి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ నర్సింహారావు తదితరులు ఉన్నారు.

చెట్లతోనే మానవాళి మనుగడ

(5వ పేజీ తరువాయి)

చేయడం చెప్పుకోదగ్గ విషయమన్నారు. అడవులను కాపాడే విషయంలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే తరహాలోనే ఈనాటి మొక్కలే రేపటి భారీ వృక్షాలుగా మారుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంపొందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ములుగు జిల్లా ఎక్కువ అటవీ విస్తీర్ణం కలిగి ఉందని, ఈ జిల్లాలో వనదేవతలు కొలువై ఉన్నారని అన్నారు. అన్ని వసతులతో కూడిన అద్భుతమైన పార్కు ఏర్పాటుకు అటవీ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే సామాజిక విలువలు, అడవుల వలన కలిగే లాభాలు, ఉపయోగాలను తెలుసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 39వ బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్, టీజీఎస్‌పీ 5వ బెటాలియన్ కమాండెంట్ సుబ్రమణ్యం, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఏపీవో వసంతరావు, ఏపీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.